క్లుప్తంగా

నేడు పైనంపాడులో 'గడప గడపకు'

అనంతగిరి: మండలంలోని పైనంపాడు పంచాయతీలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొంటారని, అన్ని శాఖల అధికారులు ఆయా శాఖల వారీగా జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఎంపీడీవో కుమార్ ఆదేశించారు.

ఎంపీడీవోగా శ్రీనివాసరావు



కూనవరం: స్థానిక ఎంపీడీఓగా వీ శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో రంపచోడవరం డీఎల్‌పీవోగా విధులు నిర్వహించిన ఆయనకు కూనవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఫుల్ అడిషనల్ చార్జీ అప్పగించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో శాఖలన్నింటిని సమన్వయం చేస్తూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తాగునీరు, ఎన్ఆర్ఈజీఎస్, హౌసింగ్, ప్లాస్టిక్ వ్యర్థాల వాడకాన్ని అరికట్టడం, చెత్త నుంచి సంపద కేంద్రాల తయారీపై దృష్టి సారించనున్నట్టు చెప్పారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న చెట్టి వికాస్

అనంతగిరి: మండలంలోని లంగుపర్తి పంచాయతీ పెదబయలు గ్రామానికి చెందిన, గ్రామ వలంటీర్ల యూనియన్ నాయకుడు జన్ని విశ్వనాథం కుమారుడు మోక్షజ్ఞ మూత్రపిండ వ్యాధితో విశాఖపట్నం కేజీహెచ్ చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి వికాస్, శనివారం విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి, జన్ని విశ్వనాథం కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం చేశారు. కొత్తూరు పంచాయతీ దింసరాయి గ్రామానికి చెందిన సింహాచలం కుమారుడు అశ్విన్‌తో పాటుగా శెట్టి నీలకంఠం ఆరోగ్య పరిస్థితి బాధితులను తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలను అందించాలని, వైద్యాధికారులను కోరారు. ట్రస్ట్ తరఫున అండగా ఉంటామని బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు.

టార్పాలిన్లు పంపిణీ



ఉపాధి వేతనదారులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: చిలకలగెడ్డ పంచాయతీలోని జాతీయ ఉపాధి హామీ పనులను ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీడీవో కుమార్ శనివారం పరిశీలించారు. వేసవి నేపథ్యంలోని వడదెబ్బ తగలకుండా పనుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధి కూలీలకు ఎంపీపీ శెట్టి నీలవేణి తన సొంత నిధులతో టార్పాలిన్లు కొనుగోలు చేసి అందజేశారు. పనులు జరిగే ప్రాంతాల్లో సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఏపీవో అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు దుస్తులు, వంట పాత్రలు అందజేసిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అడ్డతీగల: తిమ్మాపురం అగ్నిప్రమాద బాధితులకు 'సాక్షి' స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.ఆరోగ్యరాజు ఆధ్వర్యంలో శనివారం సహాయం చేశారు. ఈ మేరకు గత బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన నాలుగు కుటుంబాలకు దుస్తులు,వంట పాత్రలను అందజేశారు. అనంతరం ఆయా కుటుంబ సభ్యులకు భోజనాలు ఏర్పాటుచేశారు.

గిరిజనుల అభ్యున్నతికి పెద్దపీట

- మావోయిస్టుల కోటలో గడప గడపకు కార్యక్రమం
- మారుమూల గ్రామాల్లో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పర్యటన
- ఘన స్వాగతం పలికిన గిరిజనులు



నీలవరంలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

కొయ్యూరు: మండలంలోని మావోయిస్టుల కోటలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. శివారు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేకు గిరిజనులు బ్రహ్మరథం పట్టారు. గిరిజన సంప్రదాయంలో ఘనంగా స్వాగతం పలికారు. మండల కేంద్రానికి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న పలకజీడిని దాటుకుని ఆమె పర్యటించారు. మండలంలోని యూ.చీడిపాలెం పంచాయతీలో నక్కలమెట్ట, సంగమవలస, బంగరుబంధ, నీలవరం, గంగవరం, యూ.చీడిపాలెంలో

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 189 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంత సమస్యలపై ఆరా తీశారు. గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని పలువురు కోరారు. దీనిపై ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి స్పందించి గ్రామాలకు రహదారి సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గిరిజనుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మన్య ప్రాంతాభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నారన్నారు. మన్యంలో శివారు గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో రూ.కోటి ఈదులబంద వంతెనకు వచ్చిన నిధులు నిలిచిపోయాయి. తాజాగా ఈదులబంద కాలువపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రేవులకోట, ఈదులబందతో పాటు పలువురు గ్రామ గిరిజనులు కోరారు.వర్షాకాలంలో కాలువ దాటలేక అవస్థలు పడుతున్నామని వివరించారు.ఇక పలకజీడి కాలువను దాడుకుని నీలవరం, గంగవరం, యర్రగొండ, మర్రిపాకలు, జెర్రిగొంధి గ్రామాలకు వెళ్తున్నామని చెప్పారు.అక్కడ కూడా వంతెన నిర్మాణం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గతంలో ఈ వంతెనను ప్రతిపాదించామని త్వరలో నిధులు వస్తాయని తెలిపారు. ఎమ్మెల్యే తిరిగిన ప్రాంతమంతా ఒకప్పుడు మావోయిస్టు ప్రభావితం కావడంతో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు, అప్పన వెంకటరమణ, చింతపల్లి ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ, మహిళా విభాగ అధ్యక్షురాలు సావిత్రి, యూ. చీడిపాలెంసర్పంచ్ డి.రమేష్, శేఖర్, గంగాధర్ పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయాలు పరిరక్షించాలి



మోదకొండమ్మ ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, కమిటీ నాయకులు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: మన్య ప్రజల ఆరాధ్య దేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పెదబయలు మోదకొండమ్మ తల్లి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను శనివారం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు ఏటా నిర్వహిస్తున్నారన్నారు. మోదకొండమ్మ ఉత్సవాలు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు భక్తులు సహకారం అందించాలని కోరారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలు విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు,అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోందని, ఎవరికీ అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఎంపీపీ బొండా వరహాలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, సీతగుంట, పర్రెడ సర్పంచ్‌లు పలాసి మాధవరావు, రవిశంకర్, ఎంపీటీసీ సభ్యుడు కె.బొంజుబాబు, నాయకులు సూరయ్య, రాంబాబు, చిన్నయ్య, బొండా సన్నిబాబు, జగత్‌రాయ్, వర్తక సంఘం అధ్యక్షుడు చిన్ని.రాధాకృష్ణ, నాయకులు కనకరాజు, సింహాచలం. నీలయ్య, అంజిబాబు, అజయ్‌కుమార్, ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల నాయకులు చక్రధర్, మాలంనాయుడు, శ్రీనివాసరావు, పూర్ణచంద్రనాయుడు, రాజేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిధి నిధులు పక్కదారిపై ఫిర్యాదు

విచారణకు ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశం

రంపచోడవరం: శ్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలు చెల్లించినా ఆన్‌లైన్‌లో ఇంకా బకాయిలు ఉన్నట్లు చూపుతున్నారని మండలంలోని కె.ఎర్రంపాలెం గ్రామానికి చెందిన మీనాక్షి గ్రూపు సభ్యులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్‌గనోరేకు ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరి 2022లో రూ.50,500 శ్రీనిధిలో రుణం పొందామని, నెలకు రూ.3,500 చొప్పున రూ.50,500 మొత్తాన్ని గ్రూపు సభ్యురాలు, సర్పంచ్ పండా లక్ష్మి సమక్షంలో వీవోఏకు చెల్లించామని వారు పేర్కొన్నారు. అయితే ఆన్‌లైన్‌లో రూ. 23,928 మాత్రమే చెల్లించినట్లు చూపుతోందని వారు తెలిపారు.ఈ నేపథ్యంలో సర్పంచ్ ఆధ్వర్యంలో సమావేశమై వీవోఏను ప్రశ్నించగా తనకు సంబంధం లేదని, వెలుగు కార్యాలయంలో అడగాలని చెప్పారన్నారు. వెంటనే వెలుగు కార్యాలయంలో సంప్రదించగా సక్రమంగా డబ్బులు జమచేయలేదని తేలిందన్నారు. ఈమేరకు వారు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేకు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని వెలుగు అధికారులను ఆయన ఆదేశించారు. దీనిపై వెలుగు అధికారిణి రాధా అపర్ణ మాట్లాడుతూ సోమవారం విచారణ నిర్వహిస్తామని తెలిపారు. ఇలావుండగా పంచాయతీ పరిధిలోని దాదాపు అన్ని గ్రూపుల సభ్యులకు ఇదే సమస్య ఎదురైందని మీనాక్షి గ్రూపు సభ్యులు ఆరోపిస్తున్నారు.

మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

కొయ్యూరు/ జీకే వీధి? – కొంకోట : మండలంలోని తేగాడలో ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఈ ఏడాది ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మార్తా తిలకం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 40 వంతున సీట్లు ఉన్నాయన్నారు. టెన్త్‌లో వచ్చిన మార్కుల ప్రాతిపదికన ప్రాధాన్యతా క్రమంలో, రిజర్వేషన్ పరిగణనలోకి తీసుకుని సీట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. బాలికలకు హాస్టల్ సదుపాయం ఉందన్నారు. తొలుత మండల పరిధిలోని వారికి ప్రాధాన్యం ఇచ్చాక, అనంతరం ఇతర మండలాల వారికి సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 7లోగా ఆన్‌లైన్‌లో అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలు రూ.150, ఓసీ, బీసీ, ఈడబ్ల్యూసీ విద్యార్థులు రూ.200 చొప్పున ప్రవేశ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. http:// apms. apcfss. in, http:// cse. ap. gov. in వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో ధర్మ ప్రచార రథం పర్యటన



టీటీడీ ప్రచార రథం వద్ద భక్తులు

రంపచోడవరం/అడ్డతీగల: టీటీడీ ధర్మ ప్రచార రథం మన్యంలో విస్తృతంగా పర్యటిస్తోంది. రంపచోడవరం సమీపంలో ఐ.పోలవరం మెట్టపై తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం జరుగుతున్న విషయం విదితమే. ఆలయ ప్రారంభోత్సవం ఈనెల 22న ఉదయం 9.30 గంటలకు జరుగుతుందని, భక్తులు తరలిరావాలని టీటీడీ జనరల్ పరిపాలన అధికారి గుణభూషణ్‌రెడ్డి తెలిపారు. ఏజెన్సీలోని వివిధ గ్రామాల్లో టీటీడీ ఆధ్వర్యంలో ప్రచార రథం ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం స్వామి వారి కళ్యాణ మహోత్సవాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. స్వామి ఉత్సవ విగ్రహం కొలువైన ప్రచార రథం వద్దకు భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని పురోహితుల ఆశీర్వచనాలు తీసుకుంటున్నారు.

ఉపాధి పనుల పరిశీలన



తుంగమడుగులలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: కొలతల ప్రకారం పనిచేస్తే నిర్దేశిత వేతనం మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో కె.బాపన్నదొర అన్నారు.మండలంలోని నిమ్మలపాలెం, తుంగమడుగుల, ధాన్యంపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శనివారం పరిశీలించి, వేతనదారులు, ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడారు. జరుగుతున్న పనులను పర్యవేక్షించి ఆ మేరకు ప్రతిపాదనలు, మస్తర్లును పరిశీలించారు. ఆయన వేతనదారులకు పలు సూచనలిచ్చారు. సిబ్బంది సూచనల మేరకు కొలతలు ప్రకారం పనులు చేయాలన్నారు. చెరువులు ఇతరత్రా భూగర్భ జలాలు నిల్వలు పెరిగేలా చేపడుతున్న పనులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పలు అంశాలపై వేతనదారులకు అవగాహన కల్పించారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

తెలంగాణ హైకోర్టు న్యాయవాది రమేష్‌బాబు



రమేష్‌బాబును సత్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

మారేడుమిల్లి: మండల కేంద్రంలోని గంగాతల్లి అమ్మవారికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వ అసిస్టెంట్ న్యాయవాది పెనుబల్లి రమేష్‌బాబు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. స్థానిక గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉన్న గిరిజన సమస్యలు పరిష్కార దిశగా కోర్టుల ద్వారా న్యాయం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు నాయకులందరూ సమన్వయంగా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన రమేష్‌బాబు అనేక అవమానాలు, కష్టాలు ఎదుర్కొన్ని ఉన్నత విద్య అభ్యసించారని, ఆదివాసీ సమాజానికి గర్వ కారణంగా నిలిచారన్నారు. స్థానిక ఆదివాసీ నాయకులు ఆయనకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఆదివాసీ నాయకులు డాక్టర్ పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, పునెం ప్రదీప్, సున్నం చంద్రారావు, కర్రీ సన్యాసి రెడ్డి, మట్ల కృష్ణారెడ్డి, సాదల ప్రేమ్ కుమార్ రెడ్డి, కత్తుల రమణ రెడ్డి, రత్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బోల్తాపడిన ట్రాక్టర్ తొట్టి

కొయ్యూరు: తాటి దూలాలను తీసుకెళ్తున్న రెండు ట్రాక్టర్లు శనివారం సాయంత్రం సింగవరం డౌన్‌లో బోల్తాపడ్డాయి. వర్షం కురవడంతో రోడ్డు అంచున వేసిన బెర్మ్ తడిసిపోయింది. ఎదురుగా వస్తున్న కారును తప్పించేందుకు వాహనాలను పక్కకు తీస్తున్న క్రమంలో మట్టిలోకి జారిపోయాయి. దీంతో రెండు ట్రాక్టర్ల తొట్టెలు బోల్తాపడ్డాయి. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. త్రుటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు చెప్పారు. రేవళ్ల నుంచి కాకినాడ జిల్లా జగ్గంపేటకు వాటిని తరలిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.

సేవతోనే సంపూర్ణ ఆనందం



కింటుకూరులో గిరిజనులకు దుస్తులు, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న డాక్టర్ స్వాతి

రంపచోడవరం: ప్రజా సేవతోనే సంపూర్ణ ఆనందం కలుగుతుందని డాక్టర్ కంట స్వాతి అన్నారు. రంపచోడవరం మండలం ఆకూరు పంచాయతీ కింటుకూరు గ్రామంలో ఆమె శనివారం పర్యటించారు. అక్కడ గిరిజనులకు దుస్తులు, నిత్యావసర సరుకులు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, మందులు, సోలార్ లైట్లు, పిల్లలకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివారు గ్రామాల్లో గిరిజనులను ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. రోడ్డు సదుపాయం లేకపోవడంతో కాలినడకనే మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వచ్చిందన్నారు. అధికారులు స్పందించి గ్రామంలో రోడ్డు సదుపాయం, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. గిరిజనులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. యువత ఉన్నత విద్య అభ్యసించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. చిన్నారులకు పాఠశాలలకు పంపించాలని సూచించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



ఆటలాడుతున్న విద్యార్థులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి శెట్టి సునీత ఆధ్వర్యంలో చిన్నారులకు తాడు ఆట (టగ్ ఆఫ్ వార్) నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- నిలిచిన వాహనాల రాకపోకలు



భారీ వర్షానికి రాజవొమ్మంగిలో ప్రధాన రహదారిపై కూలిపోయిన చెట్టు



గన్నవరంలో పాకపై కూలిన వేప చెట్టు



కూటూరు వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న సిబ్బంది

వై.రామవరం: మన్యంలో శనివారం గాలివాన బీభత్సం సృష్టించింది. చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. మండలంలోని శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కురిసిన గాలివాన బీభత్సం సృష్టించింది.భారీ ఈదురు గాలులతో విద్యుత్ లైన్లపై చెట్లు పడడంతో స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్ని చోట్ల జీడిమామిడి పిక్కలు నేలరాలడంతో రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా శనివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం గంటన్నరకు పైగా కురిసింది. వారపు సంతకు ఆటకం కలిగించింది. కన్నమ్మపేట వద్ద ప్రధాన రహదారిపై పెద్ద చెట్టు కూలిపోగా రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎస్ఐ గోపీ నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది, స్థానిక యువకులు కూలిపోయిన చెట్టును తొలగించారు.

ఎటపాక: గాలివాన మండలంలో బీభత్సవం సృష్టించింది. గన్నవరం ప్రదాన రహదారిపై భారీ వేప చెట్టు కూలి ఇంటిపై పడడంతో పూరిల్లు ధ్వంసమూంది. గొరిదేవిపేట, రాయనపేట, నెల్లిపాక తదితర ప్రాంతాల్లో చెట్లు విరిగి రహదారులపై పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

కూనవరం: ఉరుములు, మెరుపులకు భయంకరమైన గాలి, వాన తోడవడంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా లేక ప్రజలు అంధకారంలో మగ్గిపోయారు. పిల్లలు, వృద్ధులు పడ్డ బాధలు వర్ణనాతీతం. కూనవరం నుంచి చింతూరు వెళ్లే రోడ్డుకు అడ్డంగా భారీ వృక్షాలు నేలకొరిగాయి. వాటితో పాటు విద్యుత్ వైర్లు అనేక చోట్ల తెగిపడ్డాయి. కూనవరం నుంచి రాజమండ్రి, కాకినాడ, రావులపాలెం. రాజోలు వెళ్లే వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఉదయం నుంచి అగ్నిమాపక సిబ్బంది, విద్యుత్ ఏఈ పరశురామ్ ఆధ్వర్యంలో నేలకొరిగిన చెట్ల తొలగింపు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు.

అనంతగిరి/చింతపల్లి రూరల్: అనంతగిరి మండలంలోని మధ్యాహ్నం నుంచి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాతావరణం చల్లబడి ఎండతీవ్రత నుంచి ఉపశమనం పొందారు. అరకు-విశాఖ ప్రధాన రహదారి వర్షపు నీరు వరదవలే ప్రవహించింది. సుమారు మూడు గంటల పాటుగా ద్విచక్రవాహన రాకపోకలు నిలిచిపోయాయి. చింతపల్లి మండలంలో శనివారం మధ్యాహ్నం నుంచి మూడు గంటలు పాటు ఉరుములు, మెరుపులుతో కురిసిన వర్షం కురిసింది. కొయ్యూరు మండలంలోని ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కాకరపాడు-కృష్ణదేవిపేట మధ్య విద్యుత్ లైన్ బ్రేక్ డౌన్ అయింది.

పాలిసెట్‌లో రాకేష్‌కు 190వ ర్యాంకు



చొప్ప రాకేష్

నబ్బువరం: సబ్బువరం మండలం జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని వెదుళ్లనరవ గ్రామానికి చెందిన చొప్ప రాకేష్ పాలిసెట్‌లో మెరిశాడు. పాలిసెట్‌లో 114/120 మార్కులు రావడంతో రాష్ట్రస్థాయిలో190వ ర్యాంకు వచ్చింది. రాకేష్ తండ్రి కనకరాజు వ్యవసాయ కూలీ కాగా తల్లి వెంకటలక్ష్మి గృహిణి. గాజువాక చైతన్యలో 10వ తరగతి చదివాడు.పాలిటెక్నిక్ పూర్తి చేసి ఐఐటీలో మంచి ర్యాంకు సాధించడమే లక్ష్యమని రాకేష్ చెబుతున్నాడు. మంచి ఉద్యోగం సంపాదించి తల్లి దండ్రులకు అండగా ఉంటానని తెలిపాడు.

ఎఫ్ఏ తిరుపతినాయుడు మృతికి సంతాపం



తిరుపతినాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: "అడుగులపుట్టు పంచాయతీలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాసగుల్లేల తిరుపతినాయుడు అనారోగ్యంతో అల్లంపుట్టు గ్రామంలో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అల్లంపుట్టు గ్రామాన్ని సందర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, రూ.5 వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రాయితీలు కుటుంబానికి అందించేందుకు కృషి చేస్తామని, అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ బొంజుబాబు, ఎంపీడీవో పూర్ణయ్య, ఏపీవో మూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ధనలక్ష్మీ, వైస్ ఎంపీపీలు సోనే, రాజుబాబు, సర్పంచ్‌లు మత్స్యరాజు, రవిశంకర్, కృష్ణారావు, నేతలు కృష్ణారావు, సింహాచలం, సూరయ్య, కనకరాజు తదితరులున్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు

జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ

పెదబయలు: జిల్లా పరిషత్ నిధులతో జిల్లాలో మంజూరైన పనులు వేగవంతం చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ అన్నారు.శనివారం పెదబయలు మండలంలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మాణం చేసిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. గత పదేళ్ల నుంచి అసంపూర్తిగా ఉన్న మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. పనుల పూర్తి కావడానికి అవసరమైన నిధులపై నివేదిక జిల్లా పరిషత్‌కు పంపించాలని స్థానిక మండల ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు. సీకరి గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, ప్రధాన రహదారికి సపోర్టింగ్ వాల్ పనులను పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో జెడ్పీ నిధులతో మంజూరు చేసిన వేగవంతం చేయాలని కోరారు.ఎంపీడీవో పూర్ణయ్య, ఎంఈవో సింజీవరావు,సీకరి సర్పంచ్ గుల్లేలు కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు వంతాల ఆనందరావు పాల్గొన్నారు.